# కాంగ్రెస్‌లో కల్లోలం



- పరకాల నియోజకవర్గంలో ఇష్టారాజ్యం
- కార్యకర్తల మధ్య విభేదాలు
- ఎమ్మెల్యే రేవూరి వ్యవహార శైలిపై అసంతృప్తి
- కొంతమందికే ప్రాధాన్యం అంటూ గుస్సా
- స్థానిక ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామంటూ హెచ్చరికలు

**వరంగల్ వాయిస్, దామెర :** రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల సమయం దగ్గరపడుతోంది. అన్ని పార్టీలు సమరానికి సై అన్నట్లుగా అస్త్ర, శస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ తీరు ఇందుకు భిన్నంగా ఉంది. నియోజకవర్గంలోని హస్తం పార్టీ కార్యకర్తల్లో నిరుత్సాహం రోజురోజుకు పెరుగుతోంది. కార్యకర్తలు ఎవరికివారే యమునాతీరే అన్నట్లుగా వ్యవహరిస్తే త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెక్కెదురు తప్పదన్న ప్రచారం సాగుతోంది. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా కూడా, ఎమ్మెల్యే రేవూరి వ్యవహార శైలితో పరకాల నియోజకవర్గంలో తమకు సరైన గుర్తింపు లభించడం లేదని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న వారికే పెద్ద పీట వేయడాన్ని అసలైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు.

## ఎమ్మెల్యే తీరే కారణమా..

స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వ్యవహార శైలే నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో అసమ్మతికి కారణమన్న ప్రచారం సాగుతోంది. టీడీపీ మూలాలున్న ఆయన ఒక వర్గానికి చెందిన కార్యకర్తలకే ప్రాధాన్యం ఇస్తూ మిగలిన వారిని పెద్దగా పట్టించుకోకపోవడంతో పార్టీలో అసమ్మతి సెగలు తారా స్థాయికి చేరాయి. తమకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదంటూ పలువురు కార్యకర్తలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. కొంతమంది నాయకులు చెప్పిందే వేదం అన్నట్లుగా ఎమ్మెల్యే రేవూరి వ్యవహరిస్తున్నారని, ఏ పని చేయాలన్నా వారి అనుమతి తప్పనిసరి అన్నట్లుగా పరకాల నియోజకవర్గంలో పరిస్థితి నెలకొందంటున్నారు.

## అసలైన కార్యకర్తలకు నిరాశే..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతోపాటు పరకాల నియోజకవర్గంలో కూడా ఆ పార్టీకే చెందిన నాయకుడు ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో ఇక తమ కష్టాలు



తీరుతాయని భావించిన అసలైన కాంగ్రెస్ వాదులకు చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. కరుడు కట్టిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిగా మారిందన్న వాదన వినిపిస్తోంది. రాష్ట్రంలో పది సంవత్సరాల బీఆర్ఎస్ పార్టీ పరిపాలనలో, అనేక రకాల ఇబ్బందులు పడ్డ హస్తం పార్టీ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి పోరాటాలే చేశారని చెప్పవచ్చు. అలాంటిది తమ గోడును వినే వారు లేక నిరుస్తాహానికి గురవుతున్నారు.

## సొంత పార్టీ నేతలకు చుక్కెదురు..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సొంత పార్టీ నాయకులను, కార్యకర్తలను పట్టించుకోకుండా, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ఎమ్మెల్యే రేవూరి సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జడ్పీటీసీలుగా బరిలో నిలిపే ప్రయత్నం చేస్తున్నారని మండిపడుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేసిన తమకే ఇలాంటి పరిస్థితి వస్తుందని అనుకోలేదని ఆవేదన చెందుతున్నారు. కొంతమంది నాయకులు కింది స్థాయిలో జరుగుతున్న పరిణామాలను, వారి బాధలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి కొనసాగితే, స్థానిక సంస్థల ఎన్నికలలో తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందని, కొందకు బడా నేతలు భావిస్తున్నారు. ఇప్పటికే కొంతమంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీని వీడి బీఆర్ఎస్ లో చేరిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా పార్టీ పెద్దలు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య నెలకొన్న అసమ్మతిని చల్లార్చి, వారి మధ్య సయోధ్యను కూర్చి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పరకాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగిరేయాలని కోరుకుంటున్నారు.

# 'నా గొడవ' భగవద్గీత లాంటిది

- జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న
- ఘనంగా కాళోజీ జయంతోత్సవం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాళోజీ నారాయణరావు తన కవితల ద్వారా వెలువరించిన 'నా గొడవ' భగవద్గీత లాంటిదని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధివతి డాక్టర్ గడ్డం వెంకన్న అన్నారు. సమాజాన్ని చైతన్యపరిచే ఇలాంటి కవితలను యువత చదవాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం వరంగల్ లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న అధ్యక్షతన కాళోజీ జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి డాక్టర్ గడ్డం వెంకన్న వూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ  కార్యక్రమంలో పీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బాసాని సురేష్, డాక్టర్ చూరేపల్లి రవికుమార్, సునీత, సిబ్బంది విజయలక్ష్మి, సునంద, ఆంజనేయులు, ఆశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాళోజి సేవలు చిరస్మరణీయం : సుందర్ రాజ్ యాదవ్

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా హనుమకొండలోని నక్కలగుట్టలో ఉన్న కాళోజి నారాయణరావు విగ్రహానికి కుడా మాజీ చైర్మన్, ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళోజి నారాయణరావు ఆశయాలను కొనసాగించేందుకు ప్రజలందరూ సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాటలను తూటాలలాగా మలిచి సమైక్యాంధ్రుల గుండెల్లో నిద్రపోయిన మహాకవి కాళోజి నారాయణరావు అని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. కాళోజీ నారాయణరావు రచనలు, పదాలు, మాటలు ప్రజల కోసం, ఉద్యమాల కోసం ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. ప్రజల కోసం పదాలను పద్యాల రూపంగా అల్లిన మహా గొప్పకవి కాళోజి నారాయణరావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ఓబీసీ నాయకులు రామస్వామి గౌడ్, పులి రజనీకాంత్, పులి సారంగపాణి, రాజు



తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో..

కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని మంగళవారం వరంగల్, హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, స్నేహ శబరీష్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా కవి కాళోజీ 111వ జయంతి ఉత్సవాన్ని తెలంగాణ తెలుగు భాష దినోత్సవంగా ప్రభుత్వం గుర్తించి ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. కాళోజీ జంక్షన్ లోని మహనీయుని నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ కమిషనరేట్ లో..

ప్రజా కవి కాళోజీ 111వ జయంతి ఉత్సవాన్ని (తెలంగాణ తెలుగు భాష దినోత్సవం) వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనరేట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాళోజీకి నివాళులు అర్పించిన వారిలో అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్ రావు, శ్రీనివాస్ తో పాటు ఏఓ, ఏసీపీలు, ఆర్ఐలు, ఇన్స్ స్పెక్టర్లు, ఇతర పోలీస్ సిబ్బంది ఉన్నారు.





